క్లుప్తంగా

విద్యా సంస్థల బంద్ విజయవంతం



కొల్లూరు : నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూయించి బంద్‌ను నాయకులు విజయవంతం చేశారు. నీట్ పరీక్షలో అవకతవకలు చోటు చేసుకోవడంతో ఆ పరీక్షలను నిర్వహించే ఎన్‌టీఏను తక్షణం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పరీక్షా పత్రాల లీకేజీకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు చొప్పర కోటేశ్వరరావు, చైతన్య, జయశంకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఏపీ హంస పట్టణ అధ్యక్షుడిగా చక్రధర్ ఎంపిక



రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ హంస) రేపల్లె పట్టణ నూతన కార్యవర్గ ఎంపిక పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా ఏపీ హంస అధ్యక్షుడు బీ.నాగవర్ధన్ ఆధ్వర్యంలో ఎలెక్షన్ అధికారి, ఏపీ హంస జిల్లా జాయింట్ సెక్రటరీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. రేపల్లె పట్టణ ఏపీ హంస అధ్యక్షుడుగా గల్లా చక్రధర్, కార్యదర్శిగా వేజండ్ల సుభాషణ్‌బాబు, కోశాధికారిగా వైవి కృష్ణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.సారంగపాణి, పబ్లిసిటీ సెక్రటరీగా పులి వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు వైద్యశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, ఆనంద్ చెస్ వింగ్స్ గుంటూరు సంయుక్తంగా జులై 7వ తేదీన చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, ఆనంద్ చెస్ అకాడమీ డైరెక్టర్ గోపీనాథ్‌లు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది రౌండ్లు జరుగుతాయన్నారు. విజేతలకు రూ.44,444 బహుమతిగా అందజేయటం జరుగుతుందన్నారు. ఓపెన్ కేటగిరీ టోర్నమెంట్‌లో అండర్ 7, 9, 11, 13, 15 వయసు గల బాల బాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేయడం జరుగుతుందన్నారు. జనరల్ కేటగిరీలో మొదటి ఐదుగురికి బెస్ట్ మెడల్, బెస్ట్ ఉమెన్ క్యాటగిరీ, బెస్ట్ అకాడమీ, బెస్ట్ స్కూల్ ఇలా వివిధ రకాలుగా బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.450 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలకు 9703049378 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి

పెదకాకాని: లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో గురువారం విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఎవరైనా విత్తనాలు అమ్మితే రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత బిల్లులను పంట సీజన్ పూర్తి అయ్యే వరకూ జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. బిల్లులు లేకుండా విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా విత్తనాలు అమ్మినా, ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మకాలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాల నిల్వలు, కొనుగోలు బిల్లులు అనుమతులకు సంబంధించి తనిఖీలు చేశారు. నంబూరు గ్రామంలోని గ్రేయిన్స్ అండ్ సీడ్స్ పేరుతో జరుగుతున్న ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. విత్తనాలను సేకరించి నమూనాలను విత్తన పరీక్ష కేంద్రానికి పంపించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, నాయకులు



భట్టిప్రోలులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

బాపట్ల: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత ముందుకుపోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పేర్కొన్నారు. అల్లూరి జయంతి వేడుకలను గురువారం బాపట్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యలంక రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్రోద్యమంలో తన ప్రాణాలను ఫణంగా పెట్టి చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. తెల్లదొరలను గడగడలాడించి నేటి తరానికి ఆదర్శనీయులుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంతెన ఆనంద గజపతిరాజు, గొల్లపల్లి శ్రీనివాసరావు, కె.భాస్కర రాజు, పి.శివాజీరాజు, జి. రామకృష్ణంరాజు, జెడి ప్రసాద్, కరెంటు శ్రీను, ధర్మారావు, పి. నరసింహమూర్తి రాజు, కళ్లం హరినాథరెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, ఇనగంటి గాంధీ పాల్గొన్నారు.

విప్లవవీరుడు అల్లూరి చిరస్మరణీయుడు

రేపల్లె రూరల్: మన్యం ప్రజల గుండె గుడిలో కొలువైన దేవుడు, బ్రిటిష్ పాలకులను హడలగొట్టిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి అన్నారు. ఇతను జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు. కేవలం 27 ఏళ్ల వయస్సులోనే తన అనుచరులతో పరిమిత వనరులతో బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీకొన్నాడన్నారు. ఆయన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ శేషాద్రి, కౌన్సిలర్ కరేటి సుజాత, అధికారులు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి నివాళి

భట్టిప్రోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరు ప్రాయంలోనే భక్తి భావం, దేశ భక్తి కలిగి ఆంగ్లేయులను గడగడలాడించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు 126వ జయంతి పురస్కరించుకుని భట్టిపోలులోని విగ్రహాల సెంటర్‌లో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో వివేకానంద విగ్రహ సాధన కమిటీ నిర్వాహకులు బందారు శ్రీనివాసరావు, రావూరి సత్యన్నారాయణమూర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరామప్రసాద్, సీహెచ్‌వీ ఉమా మహేశ్వరరావు, జంజనం హేమశంకరరావు, రామనాథం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరికి నివాళి

వేమూరు: అల్లూరి సీతారామరాజు త్యాగాలు మరువలేనివని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, ఏపీవో సత్యకృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు దైవంతో సమానం



ఏసుదాసు దంపతులకు సన్మానించిన ఉపాధ్యాయులు

కర్లపాలెం: విద్యార్థులకు చదువులతో పాటు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు దైవంతో సమానులని ఎంఈవో ఎస్.విజయశ్రీ తెలిపారు. కర్లపాలెం పంచాయతీ ఎంవి రాజుపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన ఎస్.ఏసుదాసు దంపతులను గురువారం ఎస్టీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దగల అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. ఎస్టీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఏసుదాసుకు యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అమర్‌నాథ్, బి.వెంకటేశ్వర్లు, ఎస్‌బి.సుభానీ, పివి.నాగరాజు, బి.నాగరాజు తదితరులు ఉన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



రైతులకు విత్తనాలు పంపిణీ

పిట్టలవానిపాలెం: రాయితీ వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సత్యానంద్ సూచించారు. పిట్టలవానిపాలెం రైతు సేవాకేంద్రంలో కేజీకి రూ.5ల రాయితీపై అందిస్తున్న బీపీటీ 5204, ఎంటియూ 1224, ఎంటియూ 1061 రకం వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఏడాదికి గానూ పంట సాగుదారుల హక్కు పత్రాలను రెవెన్యూ శాఖ వారు అందిస్తున్నారని వాటిని కౌలు రైతులు పొందాలని సూచించారు. ఈ పత్రాలు ఈ క్రాపు నమోదులోనూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించేటప్పుడు, ధాన్యం అమ్మకాల సమయంలో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్కంరాజు వెంకటపతి రాజు, గ్రామ మాజీ సర్పంచ్ కనుమూరి సాంబమూర్తి రాజు, వెంకట నారాయణ, బొలగాని సుబ్బారావు, ఏఈఓలు సుదర్శన రావు,శేషమ్మ పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



భట్టిప్రోలులో రోశయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

భట్టిప్రోలు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలు టీడీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొలిశెట్టి సునీల్ కుమార్, టీడీపీ నాయకులు ఇబ్రహీమ్ బేగ్‌లు రోశయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్ఆర్), టి. ఈశ్వర్ బాబు, కె.రవి కుమార్, ఎ.వాలేశ్వరరావు, బి. వెంకటేశ్వరరావు, ఎం.గోవిందరాజులు, బి.మధు, ఎస్. శ్రీనివాసరావు, శివప్రసాద్, వంగర చలమయ్య సిద్ధాంతి, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఈఓ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా నాయకులు గురువారం డీఈఓ పి.శైలజ, ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డిని కలిసి ఉపాధ్యాయ సమస్యలతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. బసవ లింగారావు మాట్లాడుతూ 2023, 2024 సంవత్సరాల్లో వేసవి సెలవులో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ, సార్వత్రిక ఎన్నికల విధులతో పాటు మనబడి నాడు–నేడు విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలవులు నిబంధనలు మేరకు ప్రిజర్వ్ చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. 1995 నుంచి 2018 వరకు నిర్వహించిన వివిధ డీఎస్సీల అప్డేట్ సీనియారిటీ జాబితాలు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలని కోరారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని, సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ జరగని ఉపాధ్యాయులకు ఆయా కేడర్లలో సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల నెలవారీ పదోన్నతులను పునరుద్ధరించి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో సిటిజన్ జాబ్ చార్ట్ అమలు చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాలలు ప్రారంభమై 20 రోజులవుతున్నా ఇంకా విద్యార్థులకు కొన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. వెంటనే నూతన పాఠ్య పుస్తకాలు అందించాలని కోరారు. డీఈఓ, ఆర్జేడీలను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు ఎన్.ఎస్.ఎస్.మూర్తి, పి.శ్రీను, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు బాలరాజు, శివరామకృష్ణ, నాగేశ్వరరావు, నరసింహారావు, భాస్కర్, సుబ్బారావు, మూర్తి తదితరులు ఉన్నారు.

తెలుగువారి కీర్తి పతాక పింగళి

ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ సాయిబాబు



బాపట్ల: జాతీయ పతాకానికి రూపకల్పన చేసి తెలుగు వారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా రైల్వే స్టేషన్ వద్ద వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ దేశ విదేశాల్లో రెపరెపలాడే మువ్వన్నెల జెండా తెలుగువారి ఘనతను చాటుతుందన్నారు. తెలుగు వారికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవ, ప్రతిష్టలను తీసుకువచ్చిన పింగళి చిరస్మరణీయులని కొనియాడారు. కార్యక్రమంలో ఏవీవీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: విద్యారంగంలో సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్ హెచ్చరించారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేసి గురువారం బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వంటి పెద్ద ఘటనలు జరిగి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంటే కేంద్రం కళ్లుమూసుకుని తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగంలో విద్యా సంస్థలను మూసివేసి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలను ప్రోత్సహించటం సిగ్గుచేటన్నారు. రెండు సంవత్సరాల కాలంలో సుమారు 61వేల పాఠశాలలను మూసివేసి ప్రభుత్వ విద్యావ్యవస్థని దెబ్బతీశారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, హేమ నాగశ్రీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నుంచి కోళ్లను రక్షించుకోవాలి

బాపట్ల జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు



భట్టిప్రోలు: వర్షాకాలం నుంచి కోళ్లను సంరక్షించుకోవాలని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. వయస్సు, జాతి, లింగ బేధాలతో కోళ్లను వేర్వేరు గదుల్లో ఉంచాలన్నారు.వాటికి చల్లని, పరిశుభ్రమైన నీటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. దాణాల తొట్లు, నీటి తొట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. షెడ్‌లోకి గాలి, వెలుతురు బాగా ప్రసరించేలా చూడాలన్నారు. దాణా బూజు పట్టకుండా చూసుకోవాలని, లిట్టరు తడి కాకుండా ప్రతి రోజూ సున్నం, సూపర్ ఫాస్ఫేట్‌ను చల్లుకోవాలని చెప్పారు. అన్నింటికీ ఒకేసారి టీకాలు వేయించాలని ఆ తర్వాత విటమిన్ల టానిక్‌లు వాడాలని తెలిపారు. యాంటీ బయాటిక్స్ ఎక్కువ రోజులు వాడితే కోళ్లల్లో పెరుగుదల లోపిస్తుందని పశువైద్యుని సలహా మేరకు వాడాలని సూచించారు.

బాధ్యతాయుత సేవలతో గుర్తింపు

ఎస్పీ వకుల్‌జిందాల్



పదోన్నతి పొందిన సిబ్బందితో ఎస్పీ

బాపట్లటౌన్: అంకితభావంతో పనిచేసి పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. జిల్లాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లకు గురువారం హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి కల్పించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పదోన్నతి పొందడం ద్వారా పెరిగిన బాధ్యతను మరింత సమర్థంగా నిర్వహించాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. పోలీస్ శాఖలో సంయమనంతో వ్యవహరించడం అత్యంత కీలకమని సూచించారు. అంకితభావంతో పనిచేసి పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ఠ పెరిగే విధంగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల నుంచి మన్ననలు అందుకోవాలన్నారు. పదోన్నతి పొందిన సిబ్బందిలో ఏం. శ్రీనివాసరావు, బి.సీతారామిరెడ్డి, డి.చిరంజీవి, యు.ప్రసాద్ రావు, ఎమ్.రవి నాగేంద్ర బాబు ఉన్నారు.

బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలి

సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున్



చిన్నారులకు జ్ఞాపికలు అందజేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున్

రేపల్లె రూరల్: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున్ చెప్పారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వినూత్నంగా బడికి పోదాం అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. మండల స్థాయిలో అధికారులు నిరంతరం పట్టణంలోని వ్యాపార సంస్థలలో తనికీలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. 14 సంవత్సరాల లోపు చిన్నారులను పనుల్లో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అట్టి చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వటంతో పాటు పాఠశాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కారుమూరు ప్రాథమిక పాఠశాల, ఆజాద్ ఉర్దూ పాఠశాల, భవిత స్కూలు కేంద్రాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న, ఉర్దూ పాఠశాలల జిల్లా అధికారి నజ్మా ఖాజూద్, భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వంగవీటి రంగా

వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపల్లె రూరల్: పేదల పక్షపాతి వంగవీటి మోహన రంగా భౌతికంగా దూరమైన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో గురువారం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం మాట్లాడారు. పేదల ఇళ్ల పట్టాల కోసం దీక్షలు బూని పేదల పక్షపాతిగా పేరొందారన్నారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అల్లంశెట్టి శ్రీనివాసరావు, చదలవాడ శ్రీనివాసరావు, చిమటా బాలాజీ, నాయకులు పాల్గొన్నారు. చెరుకుపల్లిలో రంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కొత్రా హర్షాద్, నిహాంత్, విజయ్‌కృష్ణ, నాగమల్లేశ్వర రావు, రవితేజ, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభకు అధికారులు గైర్హాజరు



పిట్టువారిపాలెంలో గ్రామసభ నిర్వహణ

పిట్టలవానిపాలెం: గ్రామంలో వర్షపు నీటి కారణంగా దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని పిట్టువారిపాలెం గ్రామ సర్పంచ్ యేత్ర అశ్వినిరెడ్డి అధికారులను కోరారు. పిట్టువారిపాలెం గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల వెంట నీరు నిలిచిపోవటంతో దోమలు పెరిగే అవకాశం ఉందని దీని వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైతే గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల సహకారం ఉంటుందన్నారు. గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ మీటర్ల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని ఏడాది దాటుతున్నా చర్యలు తీసుకోలేదని పిట్టు సాయిబాబారెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సచివాలయానికి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ గ్రామ సభకు గైర్హాజరైనట్లు అధికారులు గుర్తించారు. ఎనర్జీ అసిస్టెంట్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. గ్రామ సభకు హాజరు కాకపోవడంపై గ్రామ కార్యదర్శి వసుంధర లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభకు గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొని నివేదికలు చదివి వినిపించారు.

పేదలకు నిత్యావసరాలు, విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



వేమవరంలో పేదలకు నిత్యావసరాలు అందజేత

వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు–గ్రామ సేవ ఆధ్వర్యంలో గురువారం నిరు పేదలకు నిత్యావసరాలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా శ్రీ సత్యసాయి సంస్థల ఆధ్యాత్మిక సమన్వయకర్త ధారా నారాయణ మూర్తి మాట్లాడుతూ వేమవరం గ్రామంలో గత 8 నెలలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నిరుపేదలు, ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి ఈ సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పేదలకు నిత్యావసర సరకులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, ఇతర సామగ్రి అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు ధారా గిరిజ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిదిమంది వేదపండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.